# అనేకత్వములోని ఏకత్వమును గుర్తించుకోండి!

**Where there is faith there is devotion**
**Where there is devotion there is purity**
**Where there is purity there is God**
**Where there is God there is Bliss.**

మానవుడు ఆనందమును అనుభవించవలెనన్న నమ్మకము అత్యవసరము. నమ్మకమునకు కారణము వెతకటము కేవలము అజ్ఞానము. నమ్మకమే ప్రతిమానవుని జీవితము. నమ్మకము కలిగినవాడే మానవుడు. మా-న-వ అనగా నమ్మకము కలవాడని అర్థము. 'మానవ' అనగా మరొక అర్థము కలదు. మానవుడు అప్పటికప్పుడు జగత్తులో క్రొత్తగా వచ్చినవాడు కాదని అర్థము. యీ పదమే మానవుని పూర్ణత్వమును, సనాతనత్వమును గుర్తింపుచేస్తుంది. 'మా' అనగా కాదు, 'నవ' అనగా క్రొత్త. మానవ అనగా క్రొత్తవాడు కాదు. ఇతడు ఎన్నో జన్మలనుంచి వస్తున్నాడు. అందువలన యితడు పాతవాడేగాని క్రొత్తవాడు కాదు. ఇంకా మానవ పదమునందు 'మా' అనగా అజ్ఞానము. 'న' అనగా లేకుండా, 'వ' అనగా వర్తించటము, అజ్ఞానము లేకుండా వర్తించినవాడే మానవుడు.

కారణమేమనగా మానవునియందు పవిత్రమైన పంచభూతాత్మకమైన తత్త్వము ఉన్నది. సైంటిఫిక్‌గా మనము విచారణ చేస్తే మానవునియందు హైడ్రోజను, ఆక్సిజను, నైట్రోజను, కార్బన్ ఉన్నది. ఈనాల్గింటి సమ్మిళితమే మానవుడు. ఈ నాల్గింటి చేరికయే ప్రేమతత్త్వము. ఈనాటి సైంటిస్టులు ప్రేమతత్త్వాన్ని విభజించి పదార్థతత్త్వాన్ని మాత్రమే ప్రకటిస్తున్నారు. Splitting of love is science and spirit of love is spirituality. ప్రేమను విభజించటముచేతనే matter వారికి దొరుకుతున్నది. సైంటిస్టునకు పవిత్ర ప్రేమ, discrimination తెలియదు. వారికి విచారణాశక్తి మాత్రమే ఉన్నది.

**దుఃఖమునకు, ఆనందమునకు; పదార్థము, శక్తికి మనస్సే కారణము**

నేడు సైన్సుకు, ఆధ్యాత్మికమునకు పూర్తి విరుద్ధమైన తత్త్వము నడుస్తున్నది. Matter,

sri sathyasai vachanamrutam

energy యేవిధముగా ఉన్నదని వారు యీనాడు పరిశీలన చేయటంలేదు. Matter యొక్క తత్త్వమే energy గా మారుతుందని, ఆ energy యొక్క తత్త్వమే matter అని వారి ప్రమాణము. కానీ, యీ రెండు విభజించటానికి వీలుకాదు. ఇవి అవినాభావ సంబంధము కలవి, అన్యోన్యాశ్రయములు. వీటిని వేరు చేయుటం వలనే doubts, confusion, బయలుదేరుతున్నాయి. ఈనాడు సైంటిస్టులు నూతనమైనవి యేమి కనిపెట్టారు? వారు కనిపెట్టినవన్నీ పాతవే! ఉదాహరణకు గ్రావిటీ. ఈ గ్రావిటీ సృష్ట్యాదినుండి ఉంటున్నది. ఇది ఉన్నదని Newton హెచ్చరిక చేశాడు. అతడు ఉన్నదానినే కనిపెట్టాడు. ఇతడు కనిపెట్టక పూర్వముకూడా గ్రావిటేషన్ ఫోర్సు ఉన్నది. Matter, energy అనునవి సృష్టి ఆదిలోనే ప్రారంభమైనవి. మనస్సుయొక్క తత్త్వాన్ని మార్చుకున్నప్పుడు శక్తిరూపములో బయలుదేరుతుంది. మనస్సును దివ్యత్వములోనికి మార్చినప్పుడు అది energy గా మారుతుంది. మనస్సును ప్రకృతిదృష్టితో చూచినప్పుడు యిది matter గా వస్తుంది. ఈ దుఃఖమునకు, ఆనందమునకు; matter కు, energy కి మనస్సే కారణము. ఈ రెండింటి తత్త్వాన్ని పురస్కరించుకొనే ఆధ్యాత్మికము "మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః" అని చెప్పింది.

**దృష్టికి, దృశ్యమునకు అవినాభావ సంబంధమున్నది**

పవిత్రత అంటే ఏమిటి? ఈ పవిత్రతనే శక్తి అన్నారు. ఈ శక్తి అనగా ఏమిటి? మానవునియందు కోరిక లేకపోవటమే పవిత్రము అన్నారు. ఎప్పుడు కోరికలు బయలుదేరుతాయో అప్పుడే దుఃఖమనే shadow కూడా వస్తుంది. దుఃఖము ఎప్పుడు ప్రవేశిస్తుందో అక్కడ పవిత్రతనేది శూన్యమవుతుంది. ఈ రెండింటికిని మనస్సే కారణము. దృష్టి, దృశ్యము ఉంటున్నాయి. దృష్టి ఉండటము చేతనే దృశ్యము చూడగలుగుతున్నాము. దృశ్యము ఉండటమువలనే దృక్ చూడగలుగుతున్నది. కనుక దృష్టికి, దృశ్యమునకు అవినాభావ సంబంధమున్నది. కానీ యీనాడు మనము దృశ్యమును వేరుగా, దృక్‌ను వేరుగా చేయటంవలనే దుఃఖము ప్రారంభమవుతుంది. దృష్టి, దృశ్యము ఒక్కటైపోవాలి. దీనినే 'ఏకోహం బహుస్యాం ప్రజాయేయేతి' అని వేదము చెప్పింది. కనుక, ఏకత్వమే అనేకత్వముగా పరిణమించింది. అనేకత్వములోని ఏకత్వమును గుర్తించుకోండి.

srisathyasaivachanamrutam

**Nations are many but earth is one**
**Beings are many but breath is one**
**stars are many but sky is one**

ఈ విధముగా చూచినప్పుడు ఉన్నది ఒక్కదానిలోనే అనేకత్వాన్ని మనము చూస్తున్నాం.

**రూప, నామములు వేరైనా అందరూ మానవజాతికి చెందినవారే!**

ఇక్కడ సజాతీయ, విజాతీయ, స్వగత భేదములని మూడు ఉంటున్నాయి. సజాతీయమనగా ఏమిటి? మన రూపములు,మన నామములు ప్రత్యేకముగా ఉండినప్పటికి, మనమంతా మానవజాతే! ఇది సజాతీయము. ఈ దేహాన్ని పురస్కరించుకొని నీవు, నేను, మీరు అందరూ మానవులే! జాతి, మత, వయస్సు నామములను తలంచక అన్నింటి ఏకత్వమును విచారిస్తే మానవత్వము ఏకత్వమని తెలుస్తుంది. ఇది సజాతీయము. అమెరికావాడుగానీ, చైనావాడుగానీ, ఏ దేశమువాడు గానీ మానవుడే. ఇది సజాతీయము. విజాతీయ మనగా సంబంధము లేకపోవటం. నీకు, చెట్టుకు సంబంధము లేదు. చెట్టు, నీ జాతి అని చెప్పటానికి లేదు. వృక్షజాతికి, మానవజాతికి భేదమున్నది. ఇది విజాతీయము. ఇక స్వగతభేదము. మానవునియందు తల, కాళ్లు, చేతులు, కడుపు అనేక అంగములుంటున్నాయి. ఈ అంగములన్నీ ఉండినప్పటికీ, దేనికది వేరుగా ఉంటున్నవి. ఈ దేహమంతా ఒకే రక్తము ప్రసరిస్తున్నది. Blood ఒక్కటే. heart ఒక్కటే. ఒక్కొక్క part ఒక్కొక్క function చేస్తున్నాయి. కన్నులు చూడగలుగుతున్నాయి గాని, వినటానికి ప్రయత్నించవు; చెవులు వింటాయి గానీ చూడలేవు; దేహము ఒక్కటే అయినప్పటికి దేహములోని అంగములు వేరు వేరు పనులు చేస్తున్నాయి. ఇదే స్వగతభేదము.

**సైన్సు బాహ్యజగత్తును పరిశీలిస్తే, ఆధ్యాత్మికము అంతర్దృష్టితో దివ్యతత్త్వమును పరిశీలిస్తుంది**

ఈనాడు సైంటిస్టులు చాలా కనుక్కుంటున్నారు. కానీ, మానవత్వమందున్న దివ్యశక్తిని వారు తెలుసుకొనలేకపోతున్నారు. చిన్న ఉదాహరణ: భూమి ఒక్కటే! కాని, నిమ్మవిత్తనము నాటినప్పుడు, ఆ చెట్టునుండి వచ్చిన నిమ్మ ఫలములు పుల్లగా ఉంటాయి. మామిడి విత్తనము నాటినప్పుడు ఆ మామిడి చెట్టు ఫలములు తీయగా ఉంటాయి. వేప విత్తనము నాటినప్పుడు

srisathyasaivachanamrutam

వేపపండ్లు చేదుగా ఉంటాయి. ఈ విషయం మనందరికి తెలుసు. భూమి ఒక్కటే అయినప్పటికి విత్తనములు వేరుగా ఉంటున్నాయి. అదేవిధముగా మానవులందరియందు హైడ్రోజను, నైట్రోజను, ఆక్సిజన్, కార్బన్ ఉండినప్పటికి, వారి తెలివితేటలు ప్రత్యేకముగా పోతున్నాయి. దీనికి కారణమేమిటి? ఇది సైన్సు చెప్పదు. దైవశక్తి యిట్టిది, అట్టిది అని ఎవ్వరూ చెప్పలేరు. విజ్ఞానమునకు, ఆధ్యాత్మికమునకు భేదమేమంటే బాహ్యమైన జగత్తును science పరిశీలన చేస్తుంది. అంతర సంబంధమైన దివ్యతత్త్వాన్ని ఆధ్యాత్మికము పరిశీలన చేస్తుంది. బహిర్ దృష్టి కలిగినవాడు sciencist, అంతర్‌దృష్టి కలిగినవాడు saint. Scientist కు saint కు యెంతో difference ఉన్నది.

**సృష్టిని పరిశీలన చేసేవాడు సైంటిష్టు, సృష్టికర్తను పరిశీలన చేసేవాడు సెయింట్**

ఎక్కడనుండి ప్రారంభమైనదో అక్కడే అంతమయ్యే దానిని పూర్ణమన్నారు.

**పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణముదచ్యతే**
**పూర్ణస్య పూర్ణ మాదాయ పూర్ణమేవావ శిష్యతే**

పూర్ణముగా circle గా ఉండినటువంటిది, ఆధ్యాత్మికము. ఆది, అంత్యము ఒక్కటే. ఆది, అంత్యములకు భేదము లేదు. పూర్ణమును మద్యలో కట్ చేస్తే semicircle అవుతుంది. ఇది ఇంగ్లీషు అక్షరము c అవుతుంది. C అంటే science. ఇది ఒక దగ్గర ప్రారంభమవుతుంది. వేరొక దగ్గర అంత్యమవుతుంది. ఆది, అంత్యముల మధ్య అగమ్యగోచరమైన అగాధమున్నది. ఇది అగమ్యము, అగోచరము. Matter, spirit రెండూ semi circles. Matter ను మాత్రమే పరిశీలన చేస్తున్నారు గాని spirit ను పరిశీలన చేయటంలేదు. యీ రెండింటి తత్త్వమునే ప్రకృతి, పరమాత్మ అన్నారు. సృష్టిని పరిశీలన చేసేవాడు సైంటిస్టు. సృష్టికర్తను పరిశీలన చేసేవాడు saint. Scientist సృష్టిని మాత్రమే పరిశీలన చేస్తున్నాడు కానీ సృష్టి కర్తను పరిశీలిస్తే సృష్టి అంతా బాగా అర్థమవుతుంది. దానికే త్యాగరాజు చెప్పాడు, "రామా! నీ అనుగ్రహమొక్కటుంటే చాలు. సర్వగ్రహములు నా హస్తగతము", అని. సృష్టికర్తను అర్థము చేసుకుంటే సృష్టి అంతా మనకు అర్థమైపోతుంది. సృష్టి మన senses కు లోపలనే ఉంటున్నది. మన senses కు లోపల ఉన్నదానిని గురించి మనము ప్రత్యేకముగా ప్రయత్నము

sri sathyasai vachanamrutam

చేయనవసరము లేదే! మనము కంటితో చూస్తూ, చెవులతో వింటూ, మనస్సుతో అనుభవిస్తూ హృదయముతో విచారము చేస్తున్నాము. చేతులతో చేయటం, నోటితో మాట్లాడటం సెన్సెస్. Talking, walking, reading అంతా సెన్సెస్సే! Senses కు అతీతమైనదానిని 'అది, అది' అంటున్నాము లేకపోతే 'యిది, యిది' అంటున్నాము. 'పూర్ణమదః, పూర్ణమిదం' లో That and this difference ఉంటున్నది. That అని ఎప్పుడు ఉపయోగపెడుతున్నాము? మనకు దూరముగా ఉన్న దానిని that అంటున్నాము. దగ్గరగా ఉంటే this అంటున్నాము. అయితే, దేనికి దగ్గర, దేనికి దూరము? Below the senses ఉన్నదానిని this అంటున్నాము. Senses కు అతీతమైనదానిని That అంటున్నాము. Beyond the senses గా ఉన్నదానిని ఆధ్యాత్మికమన్నారు. Below the senses గా ఉన్నది body దేహము. Beyond the senses గా ఉన్నది హృదయము. నిత్యమైన హృదయాన్ని అనిత్యమైన దేహములో భద్రము చేస్తున్నాము. దేహమనెడి యినుపపెట్టెయందు విలువైన నగలు ఉంచుకున్నాము. ఇనుప పెట్టెలోనే నగలను పెడతాముగాని బంగారుపెట్టెలో నగలు పెట్టము. Iron safe కు no value, కాని దానిలో పెట్టిన వస్తువులకు విలువ ఉన్నది. విలువైన నగలు విలువైన బంగారు పెట్టెలో పెడితే భద్రత లేదు.

**విలువలేని యినుపపెట్టె యీ దేహంబు**
**పెట్టెలోన నగలు పెట్టినట్లు**

మన దేహములో సద్గుణములనే విలువైన వస్తువులున్నాయి. అట్టి మనస్తత్వాన్ని మనము అర్థము చేసుకోవాలంటే

Bend the body
Mend the senses
End the mind.

యిది నిజమైన process.

**మనస్సును దైవమువైపు మళ్ళించటమే మనసు మార్చటం**



sri sathyasai vachanamrutam

మనము మనస్సుయొక్క తత్త్వాన్ని చక్కగా గుర్తించాలి. ఇది ఎప్పుడు తెలుస్తుందంటే నీవు అహంకారముగా ఉండకూడదు. పనిచేయి. Bend the body. Do your duty sincerely. రెండవది, Mend the senses మన senses ఏవిధముగా ఉన్నాయని విచారణ చేయి. ఈ senses ను correct చేసుకోవాలి. తరువాత end the mind మనస్సు యొక్క తత్త్వము అంత్యము కావాలి. దీనికి అంత్యము యే రీతిగా ఉంటుంది? దీనిని తిప్పటమే దాని ఆంతర్యము. దీనికి చిన్న ఉదాహరణ. ఒక ద్వారమునకు మనము lock వేశాము. మనము lock ను తెరవాలంటే యేమి చేయాలి? ఆ lock లో మనము key పెట్టాలి. దానిని right వైపుకు turn చేస్తే open అవుతుంది. Left side turn చేస్తే lock అవుతుంది. కనుక బంధనకు, విమోచనకు ఒక్కటే మూలము. నీ హృదయమనేది lock. మనస్సు key. దానిని God side turn చేస్తే detachment. World side turn చేస్తే attachment. తెరవటానికి, మూయటానికి ఒకే key ని ఉపయోగిస్తున్నాము. ఈ key నే mind. ఈ మైండ్‌ను ప్రకృతివైపు turn చేస్తే నీకు అంతా బంధన యేర్పడుతుంది. నీ mind ను divinity పైన turn చేస్తే నీకు అంతా ఆనందమే కలుగుతుంది. మనస్సును దైవమువైపు మరల్చటమే మనస్సు మార్చటం. అదే work, worship, wisdom. ప్రతీకార్యము భగవత్ప్రీత్యర్థముగా చేయి. అది నీకు ఆనందాన్ని అందిస్తుంది. సైన్సు భౌతికమైన అనుకూలములను అందిస్తుంది. అవి తాత్కాలికము. ఈ తాత్కాలిక సుఖములకై మనము ఎందుకింత అవస్థలు పడాలి? ముగ్గురు ప్రయాణీకులు బెంగుళూరు బయలుదేరారు. ఒకడు Ist class ticket తీసుకున్నాడు. యింకొకడు 2nd class ticket తీసుకున్నాడు. మూడవవాడు 3rd class ticket తీసుకున్నాడు. 3rd class ticket తీసుకున్నవాడు బెంగుళూరు వెళ్లేముందు కొంచెము శ్రమపడతాడు. II class తీసుకున్నవాడు యింతకంటె కొంచెము తక్కువ శ్రమపడతాడు. కానీ Ist class తీసుకున్నవాడు మంచి అనుకూలములతో చక్కగా నిద్రపోతాడు. కానీ, ముగ్గురూ ఒకే station లో దిగుతారు. అదే విధముగనే ఈ సైంటిస్టులు భౌతికమైన అనుకూలములను ఏర్పరుస్తున్నారు. కానీ, యీ తాత్కాలిక సుఖములు తాత్కాలికమైన ఆనందమును మాత్రమే అందించగలవు. ఈనాడు మనము తాత్కాలిక సుఖములకు ప్రాకులాడుతూ శాంతికి దూరమైపోతున్నాము. తాత్కాలికమైన అనుకూలములు ఎంత సుఖాన్ని అందిస్తున్నాయో అంత కష్టాన్నికూడా అందిస్తున్నాయి. మనము

sri sathyasai vachanamrutam

యేమి చేస్తున్నాం? ఎక్కడకు వెడుతున్నాం? Nuclear bombs, hydrogen bombs, atom bombs తయారు చేస్తున్నాం.

చంద్రుడు మన దేహమునకు చల్లదనాన్ని అందిస్తున్నాడుగాని మెదడుకు చల్లదనాన్ని అందించటం లేదు. రోజంతా మెదడు వేడెక్కి ఉంటుంది. Air condition room లో కూర్చున్నాం. Body చల్లబడుతుంది. శాంతిలేనివాని మెదడు వేడెక్కుతుంది. మనస్సు శాంతిగా ఉండినప్పుడు అడవిలో ఉన్నా picnic అని ఆనందిస్తాడు. యీనాడు science మనకు మానసిక శాంతిని దూరము చేస్తున్నది. కృత్రిమమైన జీవితాన్ని యీనాటి scientist గడుపుతున్నాడు. నిరంతరము చింతనే, చింతనే, ఈ mind కు rest అనేది లేదు.

**మానసిక విశ్రాంతి లేకపోవడమే మానవుల రోగాలకు మూలకారణము**

ఈనాటి మానవుల రోగాలకు, మానసిక విశ్రాంతి లేకపోవటమే మూలకారణము. దీనివల్ల రోగాలు అధికమైపోతున్నాయి. ఎప్పుడు చూచినా thinking thinking. దాని వలన mind భ్రమిస్తున్నది. మనం కేవలం జడమైన మైండ్‌కే rest ఇస్తున్నాము. కానీ, మెదడుకు rest యివ్వనక్కర లేదా? ఎక్కువ తెలివితేటలున్నవాని మైండ devil's workshop అన్నారు ఈ devil's work shop కు యేమి శాంతి ఉంటుంది? వ్యక్తిగత శాంతి, సామాజిక శాంతి, దేశశాంతి మనకు ఒక ఆధ్యాత్మిక మార్గములో తప్ప అన్యమార్గములో రాదు. ఈ తత్వాన్ని మనము చక్కగా గుర్తించుకొని భౌతిక సుఖాలకోసం పోరాడకుండా, మానసిక శాంతికై పాటుపడాలి. భౌతిక సుఖాలు కొంతవరకు ఉండవలసినదే గాని, అవి natural సుఖాలుగా ఉండాలి. ఈ natural సుఖములోనే సరైన ఆనందము మనకు లభిస్తుంది.

**దైవము సర్వమును పవిత్ర భావముతోనే సృష్టిస్తాడు**

కొంతమంది నిద్ర రాకపోవటంవలన pills వేసుకుంటారు. కానీ, దానివలన సరియైన నిద్ర, విశ్రాంతి లభిస్తాయా? Natural sleep వలన సరైన విశ్రాంతి వస్తుంది. మందులవలన వచ్చిన నిద్ర సరియైన నిద్రకాదు. మనము natural జీవితాన్ని గడపాలి. అది ఆధ్యాత్మిక మార్గములో తప్ప అన్యమార్గములో మనకు రాదు. రామకృష్ణ పరమహంస వివేకానందుని touch చేసిన వెంటనే వివేకానందుడు సమాధిలోకి పోయాడని చెప్పాడు. సమాధి అంటే

sri sathyasai vachanamrutam

అర్థమేమిటి? కేవలము తన్మయము పొందటము, దేహాన్ని మరవటం సమాధి కాదు. ఇది ఒక emotion లేక excitement లేక fit కావచ్చును లేదా మత్తు కావచ్చును. ఇది సమాధికాదు. సమ ధీ equal mind సమాధి. Heat and cold, darkness and light, pain and pleasure equal గా తీసుకోటం సమాధి. Good and bad ను equal గా తీసుకోటం సమాధి. ఇవన్నీ కాలమార్పులవలన జరిగేవే! వీటిని control చేయటం సమాధి. Good and bad మనకు మనము నిర్ణయించుకుంటాము. పేదవాడు, ధనికుడని మనకు మనము నిర్ణయించుకుంటున్నాము. ఇవన్నీ మన నిర్ణయాలు. ఇవన్నీ మన దృష్టి లక్షణాలు. మన భావాల మార్పులు. ఇవి మన భేదభావములు. మనము సృష్టించుకున్నవి. దైవసృష్టిలో అంతా ఒక్కటే, భేదాలు లేవు. దైవదృష్టిలో చెడ్డ అనేది ఉన్నదా? మనదృష్టిచేతను, మనదేహవాంఛచేతను మంచి చెడ్డలుగా మార్చుకుంటున్నాము. ఈనాడు మనము evening న fresh apple, fresh banana, fresh curd తిన్నాము. మంచి ఫలములు భుజించాము. రేపు తెల్లవారి అది మలమై పోయింది. మలమునకు, ఫలమునకు time difference వలన good, bad అయింది. Good, bad అయ్యేది nature యొక్క తత్వము. మనము ఫలము తిన్నాము. ఆ ఫలము ఫలముగానే బయటకు వస్తే మనకు సారమే లేదు. పండు పండుగానే పోతే మనకు శక్తి ఎక్కడనుండి వస్తుంది? ఆ ఫలము మన దేహములోకి పోయి దాని సారము సర్వాంగములకు supply చేసి అది పిప్పిగా బయటకు పోతుంది. ఇది bad కాదు. ఇది సహజమే! ఇది good సారాన్ని అందించింది కనుక good. కనుకనే అన్నీ good యే! ఏదీ bad లేదు. జగత్తును అనుసరించి కొన్ని శాసనాలు ఉన్నాయి. ఈ శాసనాలకు విరుద్ధముగా వర్తించినప్పుడు bad అంటున్నాము. శాసనములు అనుసరించినప్పుడు good అంటున్నాము. Good and bad అనునవి మన దేహభ్రాంతులు. అవి దైవసృష్టిలో లేవు. దైవము సర్వమునూ పవిత్రమైన భావముతోనే సృష్టిస్తూ ఉంటాడు. జీవుల క్షేమాన్నే తన లక్ష్యములో ఉంచుకుంటాడు. అంతా ఉపకారమే తప్ప అపకారమేమీ చేయడు.

భగవంతుడు ఎప్పుడూ శాంతి పిపాసి. మనము 'శాంతిః శాంతిః శాంతిః' అని మూడు పర్యాయములు చెప్తుతాము. ఒక్కతూరి చెప్పవచ్చు. రెండుతూర్లు చెప్పవచ్చు. నాలుగుతూర్లు చెప్పవచ్చు. పది తూర్లు చెప్పవచ్చు. కానీ, మూడు తూర్లు మాత్రమే ఎందుకు చెప్తుతాము?

ఆది భౌతిక శాంతి, ఆది దైవిక శాంతి, ఆధ్యాత్మిక శాంతి. ఈ మూడూ మనకు కావాలి కనుక 'శాంతిః' అని మూడు పర్యాయములు చెప్పుతాము. దేహసంబంధమైన శాంతి, ఆది భౌతిక శాంతి; మానసిక సంబంధమైన విషయములలో శాంతి, ఆధ్యాత్మిక శాంతి; హృదయ సంబంధమైన విషయములలో శాంతి, ఆది దైవికశాంతి. మానవుని మూడు విధములైన దుఃఖములు పీడిస్తున్నాయి. ఆది భౌతికమనగా శరీర సంబంధమైన రోగములు. ఈ రోగములు లేకుండా చేయి. మృగముల చేతను, క్రిముల చేతను, దొంగలచేతను, పాములు, త్రేళ్లుచేతను కలిగే దుఃఖములనుండి పరిహారం చేయి. ఆది దైవికముగా అతివృష్టి వలన అనావృష్టి వలన పిడుగులు రావడం వలన, దైవికమైన బాధలనుండి పరిహారము కలిగించుట శాంతి.

**'అధ్యాత్మ విద్య విద్యానాం'**

మన చదువులు మన ప్రవర్తనలను సరిదిద్దాలి. మన ప్రవర్తనలు పరిశుద్ధము చేయాలి. పదిమందికి సహాయమైన రీతిగా, ఆదర్శమైనరీతిగా సరైన నడతను మనము జీవితములో నేర్చుకోవాలి. ఇదే నిజమైన విద్య. 'అధ్యాత్మ విద్య విద్యానాం' అన్నారు. అన్ని సబ్జెక్ట్సు, అన్ని శాస్త్రములు, అన్ని భాషలు చిన్న చిన్న నదులవంటివి. కానీ అధ్యాత్మ విద్య, సాగరమువంటిది. అధ్యాత్మ విద్య చాలా అవసరము. ఆస్తికుడు, దైవము ఉన్నాడంటాడు. నాస్తికుడు, దేవుడు లేడంటాడు. నా దృష్టిలోపల ఆస్తికుడు, నాస్తికుడు యిద్దరూ ఒక్కటే! ఎట్లనగా నాస్తికుడు మొగ్గవంటివాడు. ఆస్తికుడు విచ్చిన పువ్వువంటివాడు. ఇతడు విచ్చిన పువ్వు కాబట్టి, దాని సువాసనలు అనుభవిస్తున్నాడు. నాస్తికుడు వికసించలేదు కనుక సువాసనను అనుభవించలేకపోతున్నాడు. ఆ మొగ్గకూడా ఒక రోజు వికసిస్తుంది. రెండూ పుష్పములే! వికసించిన పువ్వు పరిమళము యిచ్చినట్లుగా, వికసించని పువ్వు పరిమళము యివ్వదు. మనము యీ రెండింటికి భేదము పాటించరాదు.

ఈనాటి నాస్తికుడే రేపటి ఆస్తికుడు. ఆంధ్రప్రదేశ్‌లో సుందరయ్య అనే కమ్యూనిష్టు లీడరు ఉండేవాడు. అతను పుట్టపర్తి వచ్చాడు. నేను communist ని అన్నాడు. నేను come you next అన్నాను. నేను చెప్పిన దానిని బాగా అర్థము చేసుకున్నాడు. ఐదు సంవత్సరముల తరువాత election లో ఓడి పోయాడు. తరువాత అనంతపురము womens college లో

srisathyasaivachanamrutam

కలిశాడు. 'మీరు చేసే పనులు యే గవర్నమెంటుగాని, ఏ వ్యక్తిగానీ ఒక individual చేసేదికాదు. ఇన్ని పవర్సు ఉండి, మినిష్టర్లుగా ఉండి యేమి మంచిపనులు చేయలేకపోతున్నాం. ప్రజల డబ్బును ప్రజల కందించటానికి వెనుకంజ వేస్తున్నాం. ఒక్క వ్యక్తి మీరు యింత జరుపుతున్నారు. ఇది ఆశ్చర్యకరము! ఇదే biggest miracle' అన్నాడు. 'ఆనాడు నీకు చెప్పింది దీనికోసమే', అని చెప్పాను. 'నీకు యిప్పుడు అర్థమైందా?' అన్నాను.

మానవుడు యేదో ఒక స్థాయిలో ప్రారంభిస్తాడు. క్రమక్రమేణా పరివర్తన జరుగుతుంది. మానవత్వము ఎప్పుడూ ఒకేస్థితిలో ఉండేదికాదు. మార్పులు కలుగుతూ ఉంటాయి. నేటి పరిస్థితులనుబట్టి మనము జంకరాదు. ఈ పరిస్థితులలో ముమ్ముందు చాలా మార్పులు కలుగుతూ ఉంటాయి. అన్నింటికి విశ్వాసము ముఖ్యము.

**విశ్వాసమునకు కారణములు వెతుకనక్కరలేదు**

సచ్చిదానందము కోయంబత్తూరు సాయీ సమితి కో-ఆర్డినేటర్, విశ్వాసము వల్లనే యింత విజయాన్ని సాధించాడు. దీనికంతా కారణం విశ్వాసమే! ఈ విశ్వాసమునకు యేమి కారణమని మనము చూడనక్కరలేదు. విశ్వాసము beyond reason. ఎట్లనగా, నీవు తల్లిని ప్రేమిస్తున్నావు. నీవు దేనివల్ల ప్రేమిస్తున్నావు? ఆమె తల్లి అన్న విశ్వాసమువల్లనే ప్రేమిస్తున్నావు. ఆమె నా తల్లి అన్న నమ్మకమే లేకపోతే నీవు ప్రేమించలేవు. He is my God అనే నమ్మకమున్నప్పుడే ప్రేమ కలుగుతుంది. ఈ ప్రేమ ఎట్లు పెరుగుతుంది, అని కొంతమంది ప్రశ్నిస్తారు. ప్రేమను పెంచటానికి ప్రయత్నము చేయనవసరము లేదు. ప్రేమిస్తూ ప్రేమిస్తూ పోతుంటే ప్రేమ పెరిగిపోతుంది. Plus+Plus = Plus అయిపోతుంది. మనము మొక్కను నాటాము; ఎట్లా పెరుగుతుందని మనము దీనిని దినము సాగదీస్తుంటే అది చచ్చిపోతుంది. కానీ, దానికి పోయవలసిన నీరు, వేయవలసిన ఎరువు వేస్తుంటే అదే పెరిగిపోతుంది. నీ నమ్మకము, నీ శ్రద్ధ, నీ భక్తి వీటిని వేస్తుంటే అదే పెరిగిపోతుంది. శ్రద్ధే జ్ఞానముగా మారిపోతుంది. అందువల్లనే 'శ్రద్ధావాన్ లభతే జ్ఞానం' అన్నారు. ఈనాడు మీరు ఎం.బి.ఎ. స్థితికి వచ్చారంటే మీ శ్రద్ధే దానికి మూలకారణము. శ్రద్ధ లేక మీరు యింత అభివృద్ధికి రాలేరు. అందుకే ప్రతిదానికికూడా శ్రద్ధ, శ్రద్ధ, శ్రద్ధ.

srisathyasaivachanamrutam

## సుఖ, దుఃఖములు మన భావములందే ఉంటున్నాయి

ఒక్కొక్కరు ఒక్కొక్క పదార్థాన్ని చూచి తృప్తి పడుతుంటారు. ఇంకా కొందరు అసంతృప్తి పడుతుంటారు. ఈ టంబ్లరులో half water ఉన్నది. తృప్తి కల్గినవాడు యీ tumbler half full గా ఉన్నదంటాడు. తృప్తి లేనివాడు యిది half empty అని నిరాశపడతాడు. ఒకడు గులాబి పుష్పాన్ని చూచి చాలా ఆనందిస్తాడు. మరొకడు దాని క్రిందనున్న thorn చూచి భయపడతాడు. కనుకనే సుఖము, దుఃఖము అనేవి ప్రత్యేకముగా లేవు. మన భావములందే ఉంటాయి. చూడండి Love is like a rose flower. There is no rose without a thorn. So, cut the flower but do not touch the thorn. నీవు చేయవలసినదంతే! మనము కావలసిన దానిని తీసుకుందాము, అక్కరలేనిదానిని వదలిపెడదాము. అవసరములేనిదానిలో నీవు వాదోపవాదము లెందుకు పెట్టుకోటం? అవసరమైనది తీసుకో! అవసరము కానిది వదలిపెట్టు! ఇటువంటి భావాలతో యువకులు దేశములో ప్రవేశించారంటే ఎంతైనా దేశం బాగుపడుతుంది. పవిత్రమైన భారతదేశములో దివ్యమైన సారమున్నది.

మొన్న కోయంబత్తూరు ప్రెసిడెంటు చెప్పాడు, యుక్తి చాలా అవసరమన్నాడు. దీనికొక ఉదాహరణము. ఒక ధనవంతుడు ఉండేవాడు. అతన్ని పరీక్ష చేసే నిమిత్తమై శ్రీలక్ష్మి, దరిద్రలక్ష్మి యిద్దరూ వచ్చారు. 'మాయిద్దరిలోపల ఎవరు అందముగా ఉన్నారు', అని నిర్ణయించమన్నారు. అతను ఆలోచించాడు. శ్రీలక్ష్మి అందంగా ఉన్నదంటే దరిద్రదేవత వచ్చి పీడిస్తుందో యేమిటో? దరిద్రలక్ష్మి బాగుందంటే శ్రీలక్ష్మి వెళ్లిపోతుందో యేమో? ఏమి చేసేది, అని ఆలోచిస్తే అప్పుడతనికి ఒక యుక్తి తట్టింది. 'మీరు అటూ ఇటూ నడవండమ్మా! మీలో ఎవరు అందముగా ఉంటారో చెప్తాతా', అన్నాడు. వారట్లే చేశారు. 'ఒకరు రండి, ఒకరు పొండి', అన్నాడు. అప్పుడు చెప్పాడు 'అమ్మా! లక్ష్మీదేవి! నీవు వస్తున్నప్పుడు చాలా అందంగా ఉంటావు. అమ్మా! దరిద్రలక్ష్మీ! నీవు పోతున్నప్పుడు చాలా అందంగా ఉంటావ'న్నాడు. ఆ విధముగా యుక్తితో యిద్దరిని తృప్తి పరిచాడు. ఈ విధముగా యుక్తితో శక్తిని సంపాదించాలి. అందువలననే 'నొప్పించక, తానొవ్వక తప్పించుకు తిరుగువాడు ధన్యుడు' అన్నారు. ఆ యుక్తే యోగముగా మారిపోతుంది. అయితే ఆ యుక్తివలన నీకుగాని, యితరులకు గానీ బాధలు కలుగకూడదు.

**(తేదీ. 06-05-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vahini / vachanamrutam